సాక్షి కామారెడ్డి

సోమవారం ǀ 15 ǀ జనవరి ǀ 2024



ప్రమాదకరంగా విద్యుత్‌ తీగలు

పెద్దకొడప్‌గల్‌ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి.

- 9లో ▸



అక్షింతల శోభాయాత్ర

జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం అయోధ్య అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం 31.9 /14.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్‌

కనుల పండువగా కల్యాణోత్సవం



బాన్సువాడ: బీర్కూర్‌ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ఆదివారం గోదాదేవి– రంగనాథుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పుష్ప దంపతులు, ఆయన సోదరుడు శంభురెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకీ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నిజాంసాగర్‌: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆదివారం జుక్కల్‌ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్‌ ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు సాయి పటేల్‌, కిషోర్‌ చౌదరి, నవీన్‌ చావ్లా ఉన్నారు.

ద్రవ రూప గంజాయి విక్రయం

- ఏడుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: ద్రవరూపంలో గంజాయి విక్రయిస్తున్న ఓ అడ్డాపై కామారెడ్డి రూరల్‌ పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు చేశారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దేవునిపల్లి పోలీసులు జాతీయ రహదారి వెంబడి ఉన్న క్యాసంపల్లి శివారులో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయిని ద్రవ రూపంలోకి మార్చి డబ్బాల లో నింపి విక్రయించే ముఠాను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిలో ఇద్దరు గంజాయిని ద్రవ రూపంలో విక్రయించే వ్యక్తులు కాగా మరో ఐదుగురు జిల్లా కేంద్రానికి చెందిన యువకులు. వీరిలో కామారెడ్డికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తల పిల్లలు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతుపై కేసు నమోదు

ఎడపల్లి (బోధన్‌) : మండలంలోని ఠానాకలాన్‌ గ్రామ శివారులో ఉన్న నిజాంసాగర్‌ ప్రాజెక్టు డీ–46 కెనాల్‌ స్థలాన్ని ఆక్రమించి సాగు చేసిన రైతు రాజిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కెనాల్‌ స్థలాన్ని ఆక్రమించి సాగుచేసిన ఉల్లి పంటను శనివారం ఇరిగేషన్‌, పోలీస్‌ శాఖల అధికారులు పరిశీలించారు. ఇరిగేషన్‌ మండల ఏఈఈ రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు రైతుపై కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎడపల్లి ఎస్సై విక్రం పేర్కొన్నారు.

సంతోషాల సంక్రాంతి



భిక్కనూరులో సీతారాముల ముగ్గు వేసిన యువతులు



- ఊరూవాడా సందడి ● వాకిళ్ల నిండా రంగుల హరివిల్లులు ● ఆత్మీయులంతా ఒక్కచోటుకు చేరిన వేళ

చెడును కాల్చే భోగి మంటలు.. కనువిందు చేసే గంగిరెద్దుల విన్యాసాలు.. నోరూరించే సకినాలు, అరిసెలు.. ఆకాశం నిండా పతంగులు.. వెరసి సంక్రాంతి పండుగ. జిల్లాలో మూడు రోజుల పండుగ సంబురాలు ఆదివారం భోగితో మొదలయ్యాయి. తెల్లవారు జామునే భోగిమంటలు వెలిగించి ఉత్సాహంగా గడిపారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి శుభం కలగాలని ఆశీర్వదించారు. జిల్లా కేంద్రంతో పాటు పలు చోట్ల గంగిరెద్దుల విన్యాసాలు కనిపించాయి. ఆకాశంలో రంగురంగుల పతంగులు ఎగిరాయి.



బీర్కూర్‌ మండలం రైతునగర్‌లో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

సాక్షి, కామారెడ్డి: పండుగ అంటేనే సరదాలు, సంతోషాలు. బతుకుదెరువు కోసం, ఉద్యోగాల కోసం, చదువుల కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారంతా పండుగపూట ఒక్కచోటుకు చేరే సన్నివేశానికి పండుగలు వేదికవుతుంటాయి. ముఖ్యంగా సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు సొంతూళ్లకు చేరుకుంటారు. ముచ్చట్లు, ముగ్గులు, ఆటపాటలు, ఆనందాల మధ్య విందు భోజనాలతో ఇళ్లన్నీ సంతోషంగా కనిపిస్తాయి. జిల్లాలో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇళ్ల ముందర రంగురంగుల ముగ్గులు వేసి ఆడవాళ్లంతా మురిసిపోతున్నారు. రెండు, మూడు రోజులుగా వాకిళ్లన్నీ రంగు రంగుల ముగ్గులతో ఆకర్షిస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలోని ఏ వీధికి వెళ్లినా రంగుల హరివిల్లులు కనిపిస్తున్నాయి. పిల్లలు పతంగులను ఎగరవేస్తూ గంతులేస్తున్నారు. చాలా మంది దోస్తులతో కలిసి విందులు చేసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చేవాళ్లతో బస్టాండ్లు కళకళలాడుతోంది. పల్లెల్లో అయితే ఎక్కడ చూసినా దావత్‌లతో ఎంజాయ్‌ చేస్తున్నారు.



ఊళ్లన్నీ జనంతో సందడిగా మారింది. ఎక్కడెక్కడో ఉన్న వాళ్లంతా పండుగ సందర్భంగా ఇంటికి చేరడంతో ఆత్మీయతను పంచుకుంటున్నారు. పిల్లల చదువులు, ఉద్యోగాల గురించి మాట్లాడుకోవడం, ఇదే సమయంలో పెళ్లిళ్ల గురించి చర్చించుకుంటున్నారు. సంక్రాంతి రోజు విందు భోజనాల కోసం ప్రతి ఇంటా ఏర్పాట్లు చేసుకున్నారు. చాలా గ్రామాల్లో కుల సంఘాల ఆధ్వర్యంలో యాటలు కోసుకుని పాళ్లు వేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మరికొన్ని చోట్ల దోస్తులు, ఇరుగు పొరుగు వారు కలిసి మేకలు, గొర్రెలను కోసి తలా కొంత పంచుకుని వండుకుంటారు. ఇదే సమయంలో మద్యం, కల్లు కూడా తమకు అవసరమైన మేర ఆర్డర్‌ చేసుకున్నారు. చాలా కుటుంబాల్లో పట్టణాల నుంచి వచ్చిన పిల్లా పెద్దలతో అందరూ ఆనందంగా పండుగను జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పిండివంటలు రెడీ చేసుకున్నారు. పండుగ రోజున మాంసంతో కూడిన వంటలతో పండుగను చేసుకోనున్నారు.



కామారెడ్డిలో చిన్నారులకు భోగిపండ్లు పోస్తూ..



కామారెడ్డి పట్టణంలో పిండి వంటలు చేస్తూ..

పశువుల దేవుడిగా ఏబిజ్‌ గాడ్‌

- కనుమ రోజు ప్రత్యేక పూజలు



మట్టితో తయారు చేసిన ఏబిజ్‌ గాడ్‌ విగ్రహం

బిచ్కుంద(జుక్కల్‌): సంక్రాంతి పండుగ సందర్భంగా పశు కాపరులు పశువుల దేవుడు ఏబిజ్‌ గాడ్‌కు కనుమ రోజు ప్రత్యేకపూజలు చేసి ఘనంగా పండుగ జరుపుకోవడం బిచ్కుంద ప్రాంతంలో ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతికి రెండు రోజుల ముందు పశువుల కాపరులు మట్టితో ఏబిజ్‌ గాడ్‌ విగ్రహం తయారు చేసి పూజలు చేస్తారు. కనుమ రోజు దేవునికి నైవేద్యంగా తీపి వంటలు, మాంసహారం, తాటి, ఈత కల్లు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. పచ్చని పందిరిలో అందరూ కలిసి వనభోజనాలు చేస్తారు. అనంతరం సాయంత్రం పశువులను హనుమాన్‌ మందిరాకి తీసుకెళ్లి అక్కడ కూడా పూజలు చేసి బాజా భజంత్రీలతో గ్రామంలో పశువుల ఊరేగింపు నిర్వహిస్తారు. అడవిలోకి పశువులు మేత కోసం వెళ్లినప్పుడు క్రూరమైన జంతువుల దాడి నుంచి పశువులు, కాపర్లకు ఏబిజ్‌ గాడ్‌ రక్షణగా ఉంటాడని కాపరుల నమ్మకం.



ఉద్దండులను ఓడించి.. ఉన్నత స్థితికి!

- కమలం పార్టీలో కాటిపల్లికి కీలక బాధ్యతలు
- జహీరాబాద్‌ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జీగా నియామకం
- అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్ట్‌ రాష్ట్ర కన్వీనర్‌గా..

సాక్షి, కామారెడ్డి: ఇద్దరు ఉద్దండులను ఓడించి రాష్ట్రంలోనే కాదు యావత్‌ దేశం దృష్టిని ఆకర్షించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి బీజేపీ నాయకత్వం మంచి ప్రాధాన్యతనిస్తోంది. తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టినప్పటికీ ఆయన ఓడించింది మామూలు వ్యక్తులను కాదు. అప్పుడు సీఎంగా ఉన్న కేసీఆర్‌, ఇప్పుడు సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డిలు ఇద్దరినీ ఓడించి జెయింట్‌ కిల్లర్‌గా పేరుగడించారు. వాక్చాతుర్యం, నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్న కాటిపల్లి వెంకటరమణారెడ్డిని పార్టీ కోసం విస్తృతంగా వాడుకునే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా జహీరాబాద్‌ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జీగా నియమించింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతలు, శ్రేణులను సమన్వయం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన ముఖ్యభూమిక పోశిస్తున్నారు. కాటిపల్లిని ఎన్నికల ఇన్‌చార్జీగా నియమించడంతో టిక్కెట్‌ ఆశిస్తున్న వారంతా ఆయన చుట్టూ తిరుగుతున్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతలను భుజాన వేసుకుని పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై ఎన్నికలకు సమాయత్తం చేశారు. జహీరాబాద్‌ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో కామారెడ్డి జిల్లాకు చెందిన కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్‌ అసెంబ్లీ నియోజకవర్గాలు, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌, ఆందోల్‌, జహీరాబాద్‌ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంటు ఎన్నికలను బీజేపీ నాయకత్వం ఈ సారి సవాల్‌గా తీసుకుంటోంది. వీలైనన్ని ఎక్కువ సీట్లు గెలుచుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా జహీరాబాద్‌పై ఫోకస్‌ చేస్తోంది. ఇక్కడ టిక్కెట్‌ కోసం తీవ్ర పోటీ నెలకొంది. పది మందికిపైగా నాయకులు టిక్కెట్‌ ఆశిస్తున్నారు.

అలాగే అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం ఈ నెలలోనే ఉన్న నేపథ్యంలో పూజిత అక్షింతలను ఊరూరికీ, ఇంటింటికీ చేర్చడానికి ఏర్పాటు చేసిన అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్ట్‌ రాష్ట్ర కన్వీనర్‌గానూ వెంకటరమణారెడ్డిని నియమించారు. దీంతో ఆయన ఇరవై రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతున్నారు. పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జీగా, ఇటు అయోధ్య తీర్థట్రస్ట్‌ రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కాటిపల్లి మరోవైపు స్థానిక ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో కార్యక్రమాలకు హాజరవుతు న్నారు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత జిల్లా అధికారులతో నియోజకవర్గ అభివృద్ధిపై రివ్యూ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అండర్‌–17 జాతీయ కబడ్డీ పోటీల నిర్వహణ విషయంలో నిర్వహణ కమిటీకి అండగా నిలిచా రు. పోటీల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించారు.

అసెంబ్లీ ఫ్లోర్‌ లీడర్‌గా చాన్స్‌..?

బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిగా వెంకటరమణారెడ్డిని నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయితే ఇద్దరు ఉద్దండులను ఓడించిన వెంకటరమణారెడ్డినే శాసనసభ పక్ష నేతగా నియమిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల బీజేపీ జాతీయ నాయకులు శాసనసభ పక్ష నేత ఎంపికపై చర్చించినపుడు వెంకటరమణారెడ్డి పేరు ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లా పరిషత్‌ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో పాటు ఐదారేళ్లుగా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన నేపథ్యంలో ఆయనకున్న అనుభవం శాసనసభలో పనిచేస్తుందన్న అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా వెంకటరమణారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారడంతో ఆయనకు పార్టీ నాయకత్వం కీలకమైన బాధ్యతలు అప్పగిస్తుందని భావిస్తున్నారు.



ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాలి



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌

- కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌

భిక్కనూరు: ప్రాచీన కాలంనాటి ఆలయాలను, చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ అన్నారు. ఆదివారం రాత్రి భిక్కనూరులోని సిద్ధరామేశ్వరాలయం వద్ద పునరుద్ధరించబడిన కోనేరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన బావులను కట్టడాలను దాతల సహకారంతో పునరుద్ధరించామన్నారు. దీనివల్ల భావితరాలకు పురాతన కట్టడాల ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. ద రెయిన్‌ వాటర్‌ సంస్థ వ్యవస్థాపకురాలు కల్పన రమేశ్‌ను కోనేరు పునరుద్ధరణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలిరెడ్డి, సర్పంచ్‌ తున్కి వేణు, ఎంపీడీవో అనంత్‌రావు, వైస్‌ ఎంపీపీ యాదగిరి, మాజీ ఎంపీపీ బల్యాల రేఖ సుదర్శన్‌, హైకోర్టు న్యాయవాది రాంరెడ్డి, ఆలయ మహంత్‌ సదాశివ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్‌ మహేందర్‌ రెడ్డి, నేతలు ఇంద్రకరణ్‌ రెడ్డి, చంద్రకాంత్‌ రెడ్డి, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం




భరత నాట్యం చేస్తున్న కళాకారులు

సిద్ధరామేశ్వరాలయంలో కోనేరు పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 'పరంపర' ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శంకరానంద స్వామి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఓం నమః శివాయ భరతనాట్య కార్యక్రమం నిర్వహించారు. పలువురు కళాకారులు చేసిన సామూహిక నృత్యాలు అలరించాయి.

'కష్టం' మిల్లింగ్‌..!

- మిల్లర్ల వద్దే గత వానాకాలం, యాసంగి ధాన్యం
- నెలాఖరు వరకు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- మిల్లర్ల అలసత్వంతో ఆలస్యం



కామారెడ్డి క్రైం: జిల్లాలో కస్టం మిల్లింగ్‌ నత్తనడకగా సాగుతోంది. లక్ష్యం కొండంత ఉన్నా.. క్షేత్రస్థాయిలో అలసత్వం కారణంగా కనీస స్థాయిలో మిల్లింగ్‌ కావడంలేదు. ఇప్పటికే 2022–23 వానాకాలం, యాసంగి సీజన్‌లకు సంబంధించిన 2.55 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం నిల్వలు జిల్లాలోని రైస్‌మిల్లుల్లోనే మూలుగుతున్నాయి. వాటి మిల్లింగ్‌ పూర్తయ్యే వరకు 2023–24 వానాకాలంలో సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు ఇవ్వడం సాధ్యం కాదు. అందుకే పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్‌ లక్ష్యాలను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. మిల్లింగ్‌ ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌ కుమార్‌రెడ్డి, సీఎస్‌ శాంతికుమారి కలెక్టర్లు, అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. జిల్లాలోని రైస్‌ మిల్లులు, రోజువారీ మిల్లింగ్‌ సామర్థ్యం, కొన్నిచోట్ల రైస్‌మిల్లర్ల అలసత్వం తదితర అంశాలను పరిశీలిస్తే సకాలంలో లక్ష్యం పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

2.55 లక్షల మెట్రిక్‌ టన్నుల నిల్వలు

గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్‌ చేయించి ప్రభుత్వ గోదాములకు తరలిస్తారు. జిల్లాకు సంబంధించి జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్‌ వద్ద 15వేల మెట్రిక్‌ టన్నులు, అడ్లూర్‌ ఎల్లారెడ్డి వద్ద 5 వేలు, పాత రాజంపేట వద్ద 20 వేల మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం గల మూడు ఎఫ్‌సీఐ గోదాములు ఉన్నాయి. బోధన్‌లో 50వేల మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం గల గోదాములు ఉన్నాయి. రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం నేరుగా రైస్‌ మిల్లులకు పంపిస్తారు. మిల్లింగ్‌ పూర్తయిన తర్వాత బియ్యంను ఎఫ్‌సీఐ గోదాములకు పంపి భద్రపరుస్తారు. అక్కడ నుంచి ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో దేశంలోని ఆయా ప్రాంతాలకు రైలుమార్గం ద్వారా సరఫరా జరుగుతుంది. ఇదిలా ఉండగా కామారెడ్డి జిల్లాలో 163 రైస్‌ మిల్లులు ఉండగా.. వాటిలో 35 బాయిల్డ్‌, 128 రా రైస్‌మిల్లులు ఉన్నాయి. ఆయా మిల్లుల్లో 2022–23 ఖరీఫ్‌కు సంబంధించి 60వేల మెట్రిక్‌ టన్నులు, రబీ సీజన్‌కు సంబంధించిన 2.10 లక్షల మెట్రిక్‌ టన్నుల చొప్పున మొత్తం 2.55 లక్షల మెట్రిక్‌ టన్నుల వరి ధాన్యం నిల్వలున్నాయి. ధాన్యాన్ని మిల్లింగ్‌ చేసి బియ్యంను గోదాములకు చేరవేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయితే గానీ 2023–24 ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యం మిల్లులకు పంపడం వీలు కాదు.

మిల్లర్ల అలసత్వం

మిల్లింగ్‌ ఆలస్యం కావడానికి ప్రధానంగా మిల్లర్ల అలసత్వం కనిపిస్తోంది. అందుకే కలెక్టర్‌, జిల్లా అధికారులు మిల్లింగ్‌ ప్రక్రియలో జాప్యం లేకుండా కొనసాగించాలని ఇదివరకే మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. క్రమం తప్పకుండా సమావేశాలను ఏర్పాటు చేస్తూ కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షిస్తున్నారు. అయినా జిల్లాలోని కొందరు మిల్లర్ల తీరు మారడం లేదు. జిల్లాలోని అన్ని రైస్‌మిల్లుల్లో నిత్యం జరిగే మిల్లింగ్‌ ద్వారా రోజుకు రెండు వేల మెట్రిక్‌ టన్నుల సీఎంఆర్‌ సాధ్యమవుతోంది. ఈ ప్రకారంగా చూస్తే నిరంతరంగా సీఎంఆర్‌ చేపట్టినా మరో నాలుగు నెలల సమయం పట్టవచ్చని భావిస్తున్నారు.

ఇక మిల్లర్ల అలసత్వం చాలా చోట్ల కనిపించేదే. మరికొన్ని చోట్ల అక్రమంగా ధాన్యం దారి మళ్లింపు లాంటి ఆరోపణలు సైతం వినిపిస్తుంటాయి. వీటన్నింటినీ అధిగమించి కనీసం ఏప్రిల్‌ వరకైనా సీఎంఆర్‌ పూర్తి చేయించాలని జిల్లా యంత్రాంగం యోచిస్తోంది.

“ చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో మిల్లింగ్‌ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షిస్తున్నాం. నిరంతరం సీఎంఆర్‌ జరుగుతోంది. సకాలంలో పూర్తి చేయని మిల్లుల యజమానులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం సూచించిన విధంగా మిల్లింగ్‌ పూర్తి చేయిస్తాం.

– అభిషేక్‌ సింగ్‌, డీఎం, సివిల్‌ సప్లయ్‌ కార్పొరేషన్‌, కామారెడ్డి

జాతీయ స్థాయి క్రీడలకు వజ్జపల్లి తండా విద్యార్థుల ఎంపిక


రాహుల్, సురేశ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వజ్జపల్లి తండాకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడలకు ఎంపికైనట్లు తండావాసులు పేర్కొన్నారు. వజ్జపల్లి తండాలోని మాలోత్ రాహుల్, మాలోత్ సురేశ్‌లు అండర్-17 విభాగంలో జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని గ్రామ సర్పంచ్ అనిల్ తెలిపారు.













పతంగులతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సంక్రాంతి సంబురాల్లో భాగంగా ఆదివారం గాలిపటాలను ఎగురవేసేందుకు చిన్నారులతో పాటు పెద్దలు సైతం పోటీపడ్డారు. రకరకాల గాలిపటాలను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాల్లో, ఇళ్లపై నుంచి ఎగురవేసేందుకు ఆసక్తి కనబరిచారు. ప్రభుత్వం చైనా మాంజాపై నిషేధం విధించినా కొంతమంది వాటిని వినియోగించారు. ఎక్కడా కూడా అధికార యంత్రాంగం చైనీస్ మాంజా అరికట్టడానికి చర్యలు తీసుకున్నట్లు కనిపించలేదు.
– సాక్షి నెట్‌వర్క్


ఎల్లారెడ్డిలో డీజే పెట్టి గాలిపటాలను ఎగురవేస్తున్న యువకులు

జాగ్రత్తలు పాటించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గాలిపటాలను ఎగురవేసే సమయంలో యువకులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం సూచించారు. గాలిపటాలను ఎగరవేస్తున్న సమయంలో విద్యుత్ తీగలను తగిలినప్పుడు వాటిని కర్రలతో తొలగించడం లాంటి పనులు చేయవద్దని అన్నారు. డాబాలపై గాలిపటాలను ఎగరవేస్తున్నప్పుడు చుట్టుపక్కల సేఫ్టీ గోడలు ఉన్న వాటిపై నుంచి మాత్రమే ఎగురవేయాలని చెప్పారు.


మద్నూర్‌లో..


దోమకొండలో..


నస్రుల్లాబాద్‌లో..


జిల్లా కేంద్రంలో..

ఇంటింటా రామనామం స్టిక్కర్లు


ధర్మారావ్‌పేట్‌లో స్టిక్కర్లను అతికిస్తున్న భక్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం ఇంటింటా రామనామం పేరుతో ముద్రించిన స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా రామ భక్తులు మాట్లాడుతూ.. ఈ నెల 22న శ్రీరామ జన్మభూమి అయిన అయోధ్యలో నిర్వహించే బాలరాముని నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ స్టిక్కర్ల అతికిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు రాజేందర్ రావు, రామాంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భోగి పండుగ

జిల్లాలో ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే చిన్నారులు, పెద్దలు లేచి పాత వస్తువులు, కట్టెలతో భోగి మంటలు వేశారు. కాసేపు చలి కాచుకున్నారు. అనంతరం సాన్నాలు చేశారు. చిన్నారులపై భోగి పండ్లను వారిని పెద్దలు ఆశీర్వదించారు. అనంతరం పిండి వంటలను ఆరగించారు.– సాక్షి నెట్‌వర్క్


భిక్కనూరులో సంబురాల్లో పాల్గొన్న మహిళలు


రామారెడ్డిలో ..


బీబీపేట: పిండి వంటలు చేస్తున్న మహిళలు

నిఘానేత్రం నీడలో ఉద్యానక్షేత్రం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రం ప్రధాన ద్వారం గేట్ వద్ద నిఘానేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఉద్యానక్షేత్రం చుట్టుపక్కల తరుచూ బోరు మోటార్ల దొంగతనాలు జరగడంతోపాటు ఉద్యానక్షేత్రంలోకి ఎవరు పడితే వారు వచ్చి, వెళ్తుండటంతో క్షేత్ర అధికారులు ఉద్యానక్షేత్రంలోకి వెళ్లే ప్రధాన ద్వారం గేట్ వద్ద సీసీ కెమెరాలతోపాటు సైరన్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యాన క్షేత్రం ప్రధానగేట్ ముందుకు ఎవరైనా మనుషులుగాని, ఏదైనా జంతువుగాని రాగానే సైరన్ మోగడంతోపాటు క్షేత్ర సిబ్బంది మొబైల్‌కు నోటిఫికేషన్ వెళ్తుంది. ఉద్యానక్షేత్రంలోని సామగ్రి రక్షణ కోసం ముందుజాగ్రత్తగా సీసీ కెమెరాతో పాటు సైరన్‌ను ఏర్పాటు చేసినట్లు క్షేత్రఅధికారి రామకృష్ణ తెలిపారు.

రాములోరి అక్షింతల పంపిణీ

జిల్లాకు అయోధ్యలో పూజలు చేసి తీసుకువచ్చిన రాములోరి అక్షింతలకు ఆదివారం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక ఆలయాల్లో పూజలు చేసి ఇంటింటికి పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు. జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ రామభక్తిని చాటుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


బీబీపేటలో అక్షింతలతో రామభక్తులు

యువకుడి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకున్న పోలీసులు
- కుటుంబ సభ్యులకు అప్పగింత

కామారెడ్డి టౌన్: తల్లిదండ్రులతో గొడవ పడి రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించిన ఓ యువకుడిని రైల్వే, పట్టణ పోలీసులు అడ్డుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ తల్లిదండ్రులతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కామారెడ్డికి వచ్చిన వినయ్‌కుమార్ డయల్ 100కు ఫోన్ చేసి తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. పట్టణ పోలీసులు వెంటనే రైల్వే పోలీసులకు సమచారం అందించారు. రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న వినయ్‌ను రైల్వే జీఆర్‌పీ, ఆర్పీఫ్, పట్టణ పోలీసులు గమనించి అడ్డుకున్నారు. అనంతరం రైల్వే స్టేషన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి నర్సింహులుకు అప్పగించారు.


రామారెడ్డిలో పంపిణీ చేస్తున్న భక్తులు


ఎల్లారెడ్డిలో ఎస్సై గణేష్‌కు అందిస్తున్న వీహెచ్‌పీ నేతలు

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల సత్తా


విజేతగా నిలిచిన జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు


జిల్లా బాలుర జట్టు

నిజామాబాద్‌నాగారం: సిద్దిపేటలో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-19 పోటీల్లో జిల్లా బాల, బాలికల జట్లు ప్రతిభ చూపాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో జిల్లా బాలికల జట్టు మహబూబ్‌నగర్‌పై విజయం సాధించగా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన సిద్ధిపేట్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాసం, స్కూల్ గేమ్స్ అబ్జర్వర్ నీరజా రెడ్డి, నిజామాబాద్ జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నట్లు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.గంగాధర్ తెలిపారు. జిల్లా జట్లకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, సొప్పరి వినోద్, జ్యోత్స్న, రాజేందర్, గంగాధర్ వ్యవహరించారు.

అనంతరం జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో డి. సింధు (ఆర్మూర్), నేహశ్రీ, కె.మధు (సుద్దపల్లి), ఎం.ప్రణీత, ఎం,స్వప్న (ధర్మారం), సాయి ప్రహర్షిక (దోమకొండ), ఎ.తిరుపతి (ఉప్పల్‌వాయి), శ్రావణ్ (ఆర్మూర్) ఉన్నారు.

'అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003-04కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత సమ్మేళనం నిర్వహించి అందరూ ఒకే చోట కలుసుకోవడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంగిల్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

గాంధారి: మండల కేంద్రంలోని ఓ బ్యాంగిల్ స్టోర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బ్యాంగిల్ స్టోర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పినట్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): రేషన్ బియ్యం పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడినా, దుకాణాల నిర్వహణలో సమయపాలన పాటించకపోయినా డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూర్‌లో రేషన్ దుకాణాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంటాపై గోనె సంచి వేసి బియ్యం తూకం చేయడం వల్ల లబ్ధిదారులు 600 గ్రాముల బియ్యం నష్టపోతున్నారని పేర్కొన్నారు. మరోసారి రేషన్ వినియోగదారులను మోసం చేస్తే ఊరుకునేదిలేదని డీలర్ బలరాంకు సూచించారు.


పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి

కోనేరులో పడి ఒకరి మృతి

నందిపేట్: ఆలయంలోని కోనేరులో పడి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని కుద్వాన్‌పూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన బాడోళ్ల గంగాధర్(47) శనివారం ఉదయం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ ఎల్లమ్మ ఆలయం దర్శనం కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. ఆలయ దర్శనానికి ముందు స్నానం ఆచరించడానికి కోనేరుకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. కోనేరులో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు అఖిలాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆకట్టుకున్న భరత నాట్యం

భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో కోనేరు పునరుద్ధరణ పనులు ఆదివారం చేపట్టారు. అందులో భాగంగా పద్మశ్రీ ఆనంద శంకర జయంత్, పరంపర ఫౌండేషన్, శంకరానంద కళాక్షేత్రం ఆధ్వర్యంలో భరత నాట్యం నిర్వహించారు.– భిక్కనూరు


తిలకిస్తున్న ప్రజలు


భరత నాట్యం చేస్తున్న భక్తులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సిరికొండ: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండ సత్యశోధక్ పాఠశాల విద్యార్థి వర్షిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య ఆదివారం తెలిపారు. ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించే 67వ ఎస్‌జీఎఫ్ పోటీల్లో వర్షిత్ పాల్గొంటాడని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థి వర్షిత్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశం పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కొయ్యగుట్ట గురుకుల ప్రిన్సిపాల్ శోభారాణి ఆదివారం తెలిపారు. ఈ నెల 20 వరకు రూ. వంద చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష ఉంటుందని మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పేకాటస్థావరంపై దాడి

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. దాడిలో రూ. 21200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీ జంతువును చంపిన వ్యక్తిపై కేసు నమోదు



రాజంపేట: అటవీ జంతువును చంపిన కేసులో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు అటవీ క్షేత్ర అధికారి రమేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శేర్‌శంకర్ తండాలో కాట్రోత్ గోవింద్ ఇంట్లో కొండ గొర్రె మాంసం ఉందని సమాచారం అందడంతో వెంటనే దాడి చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో కొండ గొర్రెను చంపి ఇంట్లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. గోవింద్‌పై జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ బాబా, భీంరెడ్డి బీట్ అధికారులు మహేశ్, దేవేందర్, సురేశ్, రాజమణి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: అనుమతి లేకుండా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ మండలంలో నాలుగు ట్రాక్టర్లు, సుంకినిలో రెండు ట్రాక్టర్లను పట్టుకొని పీఎస్‌కు తరలించిన ట్లు చెప్పారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్జకుంటలో బోరు వైర్ల చోరీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఆరు వ్యవసాయబావుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు మోటర్‌కు సంబంధించిన వైర్లను ఆదివారం చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నలుగురు రైతులకు సంబంధించిన వ్యవసాయబావుల వద్ద దుండగులు కేబుల్ వైర్లను చోరీ చేయగా వీటి విలువను మారు రూ. 40 వేలు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి చోరీకి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.